ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 కర్నూలు జిల్లా వార్తలు
గురువారం 11 ఏప్రిల్ 2024





పండుగ సామగ్రిని కొనుగోలు చేస్తున్న ముస్లింలు

అంతా ఇన్‌డైరెక్టే

వైసీపీ అధికారం చేపట్టగానే ఈఫామ్ మార్కెట్‌ను అమలులోకి తెస్తున్నామని గొప్పగా చెప్పుకుంది. కమీషన్ ఏజెంట్ల ప్రమేయం లేకుండా రైతులే నేరుగా వ్యాపారులకు తమ పంట ఉత్పత్తులను అమ్ముకోవచ్చని తెలిపింది. అయితే.. ఈఫాం మార్కెట్‌తోపాటు డైరెక్టు సేల్ విధానం కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని మార్కెట్ యార్డుల్లో బోర్డులకే పరిమితమైపోయింది. దీంతో కమీషన్ ఏజెంట్లు తమ గుత్తాధిపత్యాన్ని యథావిధిగా కొనసాగిస్తున్నారు. పాలకులు, అధికారుల మద్దతుతో రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మాటలు చెప్పినా అన్నదాతలు చివరకు కమీషన్ ఏజెంట్ల చేతుల్లో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. దీంతో ఎప్పటి నుంచో అమలవుతున్న కార్యక్రమాలకు పాతర వేయడం తప్పితే కొత్త వాటి వల్ల తమకు ఒరిగిందేముందని అన్నదాతలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను కాపాడాలనుకుంటే ఈఫామ్ మార్కెట్‌ను, డైరెక్టు సేల్ విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- డైరెక్టు సేల్ విధానానికి పాతర
- కొత్తగా ఈ-ఫామ్ మార్కెట్లని చెప్పిన జగన్
- కమీషన్ ఏజెంట్లదే గుత్తాధిపత్యం..
- రైతులపై యథావిధిగా కమీషన్ భారం
- రెండు శాతం చెల్లిస్తేనే పంట ఉత్పత్తుల విక్రయం
- ఏటా రూ.100 కోట్లు కోల్పోతున్న అన్నదాతలు
- నేరుగా కొనుగోళ్లతో రైతుకు ఎంతో ప్రయోజనం



కమీషన్ ఏజెంట్ల షాపుల ముందర రైతులు తెచ్చిన వేరుశనగ నిలువలు

డైరెక్టు సేల్ కాదని ఈ-ఫామ్ మార్కెట్

రైతులు మార్కెట్ యార్డులకు తెస్తున్న పంట దిగుబడులను వ్యాపారులకు అమ్మించే కమీషన్ ఏజెంట్ల వ్యవస్థ మార్కెట్ యార్డుల్లో ఎప్పటి నుంచో అమల్లో ఉంది. నిబంధనల ప్రకారం కమీషన్ ఏజెంట్లు రైతుల నుంచి పంట ఉత్పత్తుల అమ్మకాలపై రెండు శాతం కమీషన్ వసూలు చేయాలి. ఎటువంటి అక్రమాలకు పాల్పడకూడదు. అయితే.. రాజకీయ నాయకులు, అధికారుల నిర్లక్ష్యం, మామూళ్ల కారణంగా అక్రమాలు జోరు రోజురోజుకూ ఎక్కువైపోతున్నాయి. ఎలక్ట్రానిక్ కాటాల్లో వాస్తవ తూకం కంటే తక్కువగా చూపడంతోపాటు ఇతర మార్గాల ద్వారా యార్డుల్లో కమీషన్ ఏజెంట్ల అక్రమాల జోరు పెరిగిపోయింది.

రాష్ట్రంలోనే పత్తి విక్రయాల్లో గుర్తింపు పొందిన ఆదోని మార్కెట్ యార్డుల్లో ఒక శాతం కమీషన్ వసూలు చేయాల్సిన ఏజెంట్లు ఏకంగా నాలుగు శాతానికిపైగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. అదేవిధంగా కర్నూలు, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుల్లోనూ 2 నుంచి 4 శాతం కమీషన్‌ను రైతుల నుంచి అన్యాయంగా వసూలు చేస్తున్నారు. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు గతంలో డైరెక్టు సేల్ విధానాన్ని అమలు చేశారు. ఈ విధానం వల్ల రైతులు మార్కెట్ యార్డుల్లోనే కమీషన్ ఏజెంట్ల ప్రమేయం లేకుండా వ్యాపారులకే పంట ఉత్పత్తులను విక్రయించవచ్చు. ఈ విధానం అమలుకు మార్కెటింగ్ శాఖ అధికారులతోపాటు ఆయా మార్కెట్ యార్డుల అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాల్సి ఉంది. మొదట్లో ఈ పద్ధతి రెండు మూడు సంవత్సరాలపాటు అమలైంది. ఆ తరువాత కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని 15 మార్కెట్ యార్డుల్లో ఎక్కడా ఆ ఊసే లేదు. దీంతో ప్రస్తుత ప్రభుత్వం ఈ విధానానికి పాతర వేసి కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చింది. రెండేళ్ల కిందట ఈ-ఫామ్ మార్కెట్ పేరుతో కొత్త పథకాన్ని అమల్లోకి తెచ్చింది. అయితే.. ఈ పథకం వల్ల ప్రస్తుతం పది గ్రామాల్లో మాత్రమే అరకొరగా రైతులు లబ్ధి పొందుతున్నారు. డైరెక్టు సేల్ లేదా ఈఫామ్ పథకాల్లో ఏదో ఒకదానిపై దృష్టి సారించి ప్రభుత్వం రైతులకు న్యాయం చేయగలిగితే కమీషన్ ఏజెంట్లకు ఏడాదికి చెల్లిస్తున్న రూ.100-150 కోట్లు రైతులకు మిగిలిపోయే అవకాశం ఉంది.

నత్తను తలపిస్తున్న ఈ-ఫామ్ మార్కెట్లు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులు పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకోసం 15 మార్కెట్ యార్డులను ఏర్పాటు చేశారు. కర్నూలు, ఆదోని, నంద్యాల, ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు, బనగానపల్లె, కోవెలకుంట్ల, ఆలూరు, పత్తికొండ, కోడుమూరు, పాణ్యం, కోసిగి కేంద్రాల్లో రైతులు తమ పంట ఉత్పత్తులను వ్యాపారులకు అమ్ముకునేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రారంభంలో డైరెక్టు సేల్ విధానం అమలైంది. దీని వల్ల ప్రభుత్వానికి ఒక శాతం కమీషన్ మాత్రమే చెల్లించేవారు. డైరెక్టు సేల్ విధానం వల్ల తమకు భారీగా నష్టం జరగనుండడంతో కమీషన్ ఏజెంట్లు, రాజకీయ నాయకులు మార్కెట్ కమిటీల అధికారులపై ఒత్తిడి తెచ్చి డైరెక్టు సేల్ పథకం అమలు కాకుండా చేశారు. ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏ మార్కెట్ యార్డులో కూడా డైరెక్టు సేల్ అమలు కావడం లేదు.

ఈ-ఫామ్ మార్కెట్‌ను అమలు చేస్తాం

ఈ-ఫామ్ మార్కెట్ డైరెక్టు సేల్ విధానానికి బదులు ప్రస్తుతం ప్రభుత్వం ఈ-ఫామ్ మార్కెట్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ విధానంలో వ్యాపారులు గ్రామాలకే వెళ్లి రైతుల నుంచి పంట దిగుబడులను కొనుగోలు చేస్తారు. దీని వల్ల రైతులు ఎటువంటి కమీషన్ చెల్లించాల్సిన అవసరం ఉండదు. మరోవైపు రవాణా ఖర్చులు కూడా ఆదా అవుతాయి. ప్రస్తుతం కర్నూలు జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో కొన్ని గ్రామాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం. త్వరలోనే అన్ని గ్రామాల్లో అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

- ఏడీఎం నారాయణ మూర్తి



కర్నూలు(అగ్రికల్చర్), ఏప్రిల్ 10: ఈ రైతు పేరు ఎల్లప్ప, క్రిష్ణగిరి మండలం. తనకున్న ఐదెకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశాడు. గిట్టుబాటు ధర అందుతుందనే ఆశతో కర్నూలు మార్కెట్ యార్డుకు వేరుశనగ కాయలను అమ్మకానికి తీసుకువచ్చాడు. మార్కెట్ యార్డులో డైరెక్ట్ సేల్ బోర్డును చూసి అధికారులను ఆశ్రయించాడు. అయితే.. ఈ విధానం అమలు కావడం లేదని తేల్చి చెప్పడంతో మరో దారి లేక తిరిగి కమీషన్ ఏజెంట్ వద్దకే వెళ్లాల్సి వచ్చింది. ఆ ఏజెంట్ రెండు శాతం కమీషన్ తీసుకుని రైతును తెచ్చిన ఉత్పత్తులను వ్యాపారికి అప్పగించాడు. వేరుశనగ కాయలు అమ్మినందుకు ఆ రైతుకు డబ్బులను వెంటనే కమీషన్ ఏజెంట్ చెల్లించాలి. అయితే వారం రోజులకు పైగా గడిచిపోయినా డబ్బులు రాకపోవడంతో ఆ రైతు పరిస్థితి దయనీయంగా మారింది. ఇలా కర్నూలు, నంద్యాల జిల్లాలోని రైతులంతా ప్రస్తుతం మార్కెట్ యార్డుల్లో డైరెక్టు సేల్‌తో పాటు ఈ-ఫామ్ మార్కెట్ అమలు కాకపోవడం వల్ల కమీషన్ ఏజెంట్ల అక్రమాలకు బలవుతున్నారు.

డైరెక్ట్ సేల్ లేకుండా చేశారు

కొత్త కొత్త పథకాల పేరుతో ఎప్పటి నుంచో అమలవుతున్న కార్యక్రమాలకు పాతర వేశారు. రెండేళ్ల కిందట ప్రభుత్వం రైతుల నుంచి వ్యాపారులు పంట దిడుబడులు కొనేలా ఈ-ఫామ్ మార్కెట్లను అమల్లోకి తెచ్చింది. అయితే.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పది గ్రామాల్లో మాత్రమే ఈఫామ్ మార్కెట్ విధానం అమలవుతోంది. పూర్తి స్థాయిలో ప్రతి గ్రామంలో రైతులు పండించిన పంట ఉత్పత్తులను ఈ విధానం ద్వారా ఎప్పుడు రైతుల చేత కొనుగోలు చేయిస్తారో చెప్పలేని పరిస్థితులు ఉన్నాయి. గతంలో పంట ఉత్పత్తుల కొనుగోలు నేరుగా వ్యాపారుల చేతనే చేపట్టేందుకు డైరెక్టు సేల్ (ప్రత్యక్ష అమ్మకం) విధానాన్ని అమలులో ఉండేది. అయితే.. దీని వల్ల తాము నష్టపోతామనే భయంతో కమీషన్ ఏజెంట్లు.. రాజకీయ నాయకులు, మార్కెటింగ్ శాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చి డైరెక్టు సేల్ విధానం అమలు కాకుండా చేశారు.

కమీషన్ ఇవ్వాల్సిన అవసరం లేదు..

ఈ డైరెక్టు సేల్ విధానం వల్ల కమీషన్ ఏజెంట్లకు రైతులు ఎటువంటి కమీషన్ ఇవ్వాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుతం పంట ఉత్పత్తులపై కమీషన్ ఏజెంట్లు రైతుల నుంచి రెండు నుంచి నాలుగు శాతం కమీషన్‌ను వసూలు చేస్తున్నారు. జిల్లా మొత్తం మీద ఏటా కమీషన్ రూపంలో రైతులు సంవత్సర కాలానికి చెల్లిస్తున్న మొత్తాన్ని అంచనా వేస్తే దాదాపు రూ.100 నుంచి రూ.150 కోట్ల దాకా ఉంటుంది. ప్రభుత్వం రైతులపై మోపుతున్న ఈ మొత్తం భారాన్ని పూర్తిగా తగ్గించేందుకు, ఇతర అక్రమాలను నిరోధించేందుకు ఈ-ఫామ్ మార్కెట్‌తోపాటు డైరెక్టు సేల్ విధానాన్ని ఉమ్మడి జిల్లాలోని 15 మార్కెట్ యార్డుల్లో అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

బోర్డుకే పరిమితమైన డైరెక్టు సేల్ విధానం

కర్నూలు మార్కెట్ యార్డులో డైరెక్టు సేల్ విధానం బోర్డుకే పరిమితమైంది. రైతులు డైరెక్టుగా కమీషన్ ఏజెంట్ల వద్దకే వెళ్లి పంట ఉత్పత్తులను వారి షాపుల వద్ద నిల్వ చేసి విక్రయించాల్సిన పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. దీని వల్ల కమీషన్ ఏజెంట్లు 2 నుంచి 4 శాతం కమీషన్‌ను రైతుల నుంచి వసూలు చేయడమే కాకుండా మరోవైపు వ్యాపారుల నుంచి కూడా లబ్ధి పొందుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కోడుమూరు, మంత్రాలయం, ఆలూరు, ఆదోని, పత్తికొండ నియోజకవర్గాల్లో పది గ్రామాల్లో మాత్రమే ఈ-ఫామ్ మార్కెట్ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ ఆరు నియోజకవర్గాల్లో కూడా పట్టుమని ఒక శాతం రైతులు కూడా లబ్ధి పొందలేని పరిస్థితి. ఇప్పటికైనా ఈఫామ్ మార్కెట్ విధానాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆధ్యాత్మికత వెల్లివిరిసే రోజు

- సత్కార్యాల సమాహారమే రంజాన్ మాసం
- ముగిసిన కఠోర ఉపవాస దీక్షలు
- నేడు 'ఈద్-ఉల్-ఫితర్'

కర్నూలు (కల్చరల్), ఏప్రిల్ 10: దైవిక భావనతో, నియమబద్ధంగా ఉపవాసాలు, ప్రార్థనలు, దానధర్మాలతో ముప్పయి రోజులు గడిపాక పవిత్ర రంజాన్‌ను గురువారం జరుపుకోనున్నారు. బుధవారం సాయంత్రం ఇఫ్తార్ సమయంలో ఉపవాస దీక్షలను ముగించాక భక్తులు నెలవంక దర్శనం చేసుకున్నారు. దీంతో గురువారం 'ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్)' జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ఈద్గాలను శుభ్రం చేసి, షామియానాలు, మంచినీటి వసతి కల్పించారు. బుధవారం ఉభయ జిల్లాల్లోని వాణిజ్య ప్రాంతాలు జనసందడితో నిండిపోయాయి. కర్నూలు నగరంలో గడియారం ఆసుపత్రి, పూల బజార్, చిన్న మార్కెట్, పెద్ద మార్కెట్, మించిన్ బజార్ తదితర ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. కర్నూలు, నంద్యాలతోపాటు ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, పత్తికొండ, నందికొట్కూరు, ఆత్మకూరు, బనగానపల్లె పట్టణాల్లో, మండల కేంద్రాల్లో ఈద్గాల వద్ద రంజాన్ వేడుకల ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.

ఖురాన్ ఆవిర్భవించిన రోజు

చాంద్రమానం ప్రకారం ఇస్లామిక్ కేలండర్‌లో తొమ్మిదో నెలగా 'రంజాన్' మాసం వస్తుంది. పవిత్ర ఖురాన్ గ్రంథం ఈ మాసంలోనే ఆవిర్భవించింది. దైవ దూతలు పుడమికి విచ్చేసే శుభప్రదమైన రాత్రి 'షబ్-ఏ-ఖద్ర్' ఈ మాసంలోనే వస్తుంది. అందుకే ఈ నెల తర్వాత వచ్చే రంజాన్ ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది.

ప్రార్థనలకు ఏర్పాట్లు : కర్నూలు నగరంలో కొత్త బస్టాండు రోడ్డులోని పాత ఈద్గాతోపాటు, సంతోష్‌నగర్‌లోని కొత్త ఈద్గాలో రంజాన్ నమాజ్‌లకు మున్సిపల్ తదితర శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈద్గాలను శుభ్రం చేశారు.

25న ఎన్నికల పరిశీలకులు రాక

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 10: రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు ఈ నెల 25వ తేదీన కర్నూలు జిల్లాకు రానున్నారని కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఈ సమావేశంలో పోలింగ్ కేంద్రాల వద్ద కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై నోడల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు జిల్లాకు రానున్నారని, ఆలోగా ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండు లైట్లు, ఫ్యాన్స్, టాయిలెట్ విత్ రన్నింగ్ వాటర్ తదితర మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి ప్రసన్న, పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ ఈ నాగేశ్వరరావు, ఈడబ్ల్యూఐడీసీ లక్ష్మీనారాయణ, కర్నూలు మున్సిపల్ సిబ్బంది, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, గూడూరు మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుల నియామకం

జిల్లా ఎన్నికల పరిశీలకులుగా నలుగురుని నియమించినట్లు కలెక్టర్ సృజన తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సాధారణ ఎన్నికల నిర్వహణపై లెయిజన్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంటుకు ఒక అబ్జర్వర్, కర్నూలు, కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాలకు ఒక జనరల్ అబ్జర్వర్, ఆలూరు, ఆదోని, పత్తికొండ నియోజకవర్గాలకు ఒక జనరల్ అబ్జర్వర్.. ఉమ్మడి జిల్లాలకు కలిపి ఒక పోలీసు అబ్జర్వర్ రానున్నారని తెలిపారు. ఎస్పీతో మాట్లాడి అబ్జర్వర్లకు గన్‌మెన్లను ఏర్పాటు చేయిస్తామని అన్నారు. ఈ సమీక్షలో డీఆర్వో మధుసూదన్‌రావు, అబ్జర్వర్ల నోడల్ అధికారి విజయ, జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు శామ్యూల్, సెరికల్చర్ అధికారి, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.



బురదలో యువత..

చౌడేశ్వరికి జ్యోతులు

- ప్రత్యేక ఆకర్షణగా ఎద్దుల బండ్లు, గాడిదల ప్రదర్శన
- ఉగాది ఉత్సవంలో కిక్కిసిరిన భక్తులు

కల్లూరు, ఏప్రిల్ 10: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కల్లూరు చౌడేశ్వరీదేవి అమ్మవారికి భక్తులు జ్యోతుల సమర్పణ కార్యక్రమం కన్నులపండువగా నిర్వహించారు. బుధవారం తెలవారుజామున ఆలయ కార్యనిర్వహణ అధికారి గుర్రెడ్డి, చైర్మన్ పోలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కల్లూరు ఊరువాకిలి నుండి జ్యోతులతో ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలతో నందికోల సేవ, ఖడ్గసేవను భక్తులు నిర్వహించారు. అనంతరం జ్యోతులను చౌడేశ్వరి అమ్మవారికి సమర్పించారు. పెళ్ళీడు అమ్మాయిలు, అనారోగ్యంతో బాధపడే మహిళలు, ఉద్యోగాలు కాంక్షించే యువకులు జ్యోతులను ఎత్తుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి జ్యోతి ఉత్సవాన్ని తిలకించేందుకు కల్లూరు వీధుల్లో భక్తులు కిక్కిరిసిపోయారు. సాయంత్రం ఎద్దులబండ్లతో, గాడిదలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణ వేడుకలను నిర్వహించారు. రజకులు గాడిదలను అలకంకరించి బండ్లుకట్టి మంగళ వాయిద్యాలు, డీజే సౌండ్స్ డ్రమ్స్‌తో ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి తరలించి ఆలయం చుట్టూ తిప్పి మొక్కులు తీర్చుకున్నారు. యువకులు కేరింతలు కొడుతూ బురదనీటిలో సందడి చేశారు. వర్షాలు సకాలంలో కురవాలని, పంటలు బాగా పండాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీ. ఈవేడుకను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుండి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.



యువకులు, చిన్నారుల కోలాహలం

గాడిదల ఊరేగింపు





ఆలయం చుట్టూ ఇలా...



కల్లూరు చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయం చుట్టూ తిరుగుతున్న బండ్లు

జట్టుగా జనంలోకి..

- ఎంపీ, ఏడు ఎమ్మెల్యే స్థానాల్లో గెలుపే లక్ష్యం
- ఎన్డీయే కూటమి సమావేశంలో నేతలు

కర్నూలు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఇమేజ్.. టీడీపీ అధినేత చంద్రబాబు పాలన అనుభవం.. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్టార్ ఇమేజ్‌తో జట్టుగా జనంలోకి వెళ్లి అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేద్దామని ఎన్డీయే కూటమి నాయకులు స్పష్టం చేశారు. సీఎం జగన్ సారథ్యంలోని వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజలకు వివరిస్తూ.. కర్నూలు పార్లమెంట్ పరిధిలో ఎంపీ సహా ఏడు అసెంబ్లీ స్థానాల్లో విజయమే లక్ష్యంగా సమష్టిగా ముందుకు సాగుదామని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ముఖ్య నేతలు కీలక నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అధ్యక్షతన మంగళవారం కూటమి నాయకుల సమన్వయ సమావేశం జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, జనసేన ఉమ్మడి జిల్లాల సమన్వకర్త చింతా సురేశ్ సహా కర్నూలు ఎంపీ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, కర్నూలు, ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయం, ఆలూరు టీడీపీ అభ్యర్థులు టీజీ భరత్, బీవీ జయనాగేశ్వరరెడ్డి, మాధవరం రాఘవేంద్రరెడ్డి, బి.వీరభద్రగౌడ్, ఆదోని బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి, ఆదోని టీడీపీ ఇన్‌చార్జి కె.మీనాక్షినాయుడు బీజేపీ సీనియర్ నాయకుడు కపిలేశ్వరయ్యతో పాటు ఆయా పార్టీల నియోజకవర్గం ఇన్‌చార్జిలు హాజరయ్యారు. మే 13న జరిగే పోలింగ్, ఆ తరువాత జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు వరకు కూటమి నేతలు అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధానంగా చర్చించారు. జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో కూటమి నాయకులు సమన్వయం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గం నుంచి మూడు పార్టీ నాయకులతో కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసి ఆ కమిటీ ఆధ్వర్యంలో ముందుకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో బీజేపీ ఇన్‌చార్జిలు సూర్యప్రకాశ్, కోటేశ్వరరెడ్డి, ప్రేమ్‌కుమార్, మురహరిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీరాములు, వెంట్రాముడు, జనసేన ఇన్‌చార్జిలు, ఎన్.మల్లప్ప, వెంకటప్ప, రేఖాగౌడ్, సీజీ రాజశేఖర్, ఎస్.హర్షద్, మంత్రాలయం లక్ష్మన్న, రాంబాబు, టీడీపీ నాయకులు సత్రం రామకృష్ణ, ముంతాజ్‌బేగం, జేమ్స్, కేఈ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న బీటీ నాయుడు, బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

జగన్ దొంగ ఓట్లను నమ్ముకున్నాడు: బీటీ నాయుడు

సీఎం జగన్ దొంగ ఓట్లను నమ్ముకున్నారు. ప్రజలు కట్టే పన్ను నుంచి వలంటీర్లకు జీతాలు ఇస్తూ వారి ద్వారా గెలవాలనే ఎత్తులు వేస్తున్నారు. దీనిని ధీటుగా ఎదుర్కొంటాం. మూర్ఖుడైన జగన్‌ను గద్దె దించడానికి తీసుకోవాల్సిన అంశాలపై కూటమి సమవేశంలో చర్చించాం. రాబోయేది ఎన్డీయే ప్రభుత్వమే. ఆంధ్రుల ఆత్మగౌరవం కోసమే చంద్రబాబు, ప్రధాని మోడీ, పవన్ కళ్యాణ్ జట్టు కట్టారు.

- **కూటమి విజయం తథ్యం: విట్టా రమేష్, బీజేపీ పార్లమెంట్ ఇన్‌చార్జి**

రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయం సాధించాలి. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. జగన్ రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేశారు. ఈ రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పట్టాలు ఎక్కాలంటే కూటమి గెలుపు అనివార్యం. కూటమి నాయకులు, కార్యకర్తలు జట్టుగా ప్రజల వద్దకు వెళ్లాలి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చూడాల్సిన అవసరం ఉంది.

- **సూపర్ సిక్స్ వరాలు ఇంటింటికి తీసుకెళ్లాలి - చింతా సురేశ్, జనసేన ఉమ్మడి కర్నూలు జిల్లా కో ఆర్డినేటర్**

జగన్ పాలన వల్ల అభివృద్ధి లేని రాష్ట్రంగా మిగిలింది. రాష్ట్రాన్ని బాగు చేసే కూటమి ప్రభుత్వం రావాలి. జగన్ పాలన వైఫల్యాలు, అదే క్రమంలో టీడీపీ హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు ఇంటింటా ప్రచారం చేయాలి. ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలి.

- **పవన్ చొరవతోనే కూటమి - కునిగిరి నీలకంఠ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు**

రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలంటే కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఉండాలి. అందుకే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకొని ఓటు చీలకుండా కూటమి ఏర్పాటుకు కీలకంగా వ్యవహరించారు. ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కూడా ప్రజలకు వివరించాలి.



పిడకల సంబరం..

- ఉత్కంఠభరితంగా సాగిన పిడకల సమరం
- కైరుప్పల గ్రామంలో నుగ్గులాట
- 20 మందికి గాయాలు

దేవతల పెళ్లిలో వింత ఆచారం





అలంకరణలో వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవారు

ఆదోని/ఆస్పరి, ఏప్రిల్ 10: ఆస్పరి మండల పరిధిలోని కైరుప్పల గ్రామంలో బుధవారం పిడకల సమరం అత్యంత ఉత్కంఠంగా సాగింది. ఏటా సంప్రదాయబద్ధంగా జరిగే ఈ పిడకల సమరంలో వీపులు కందిపోయి, తలలకు గాయాలైనా లెక్క చేయకుండా రాసులుగా పోసిన పిడకలన్నీ అయిపోయే వరకు కొట్టుకుంటూ గ్రామస్థులు ఆనందంతో మునిగితేలారు. కైరుప్పలలో వీరభద్రస్వామి కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహించే పిడకల సమరానికి పౌరాణిక నేపథ్యం ఉంది. వేట కోసం వచ్చిన వీరభద్రస్వామి కాళికాదేవిని చూసి ప్రేమలో పడతాడు. భద్రకాళి దేవితో ఏర్పడిన మనస్పర్థలతో వివాదం తలెత్తుతుంది. ఆ సందర్భంగా వారి వర్గీయుల మధ్య గొడవ జరిగి, అందుబాటులో ఉన్న పిడకలతో పరస్పరం కొట్టుకోగా, అదే సంప్రదాయాన్ని నేటికీ ఉత్సవ రూపంలో ఆచరిస్తున్నారు. కారుమంచి గ్రామానికి చెందిన పెద్దరెడ్డి వంశస్థులు ఉత్సవ నిర్వహణలో ప్రధాన పాత్ర పోషించారు. ఈ వంశస్థుల్లో ఒకరైన చిన్నారెడ్డి కుమారుడైన నరసింహారెడ్డి రాజరికాన్ని గుర్తు తెచ్చేలా ప్రత్యేక వస్త్రాధారణతో సాయంత్రం 5 గంటల సమయంలో గుర్రంపై మందీమార్బలం, తప్పెట్లు మేళతాళాలతో ఊరేగింపుగా కైరుప్పల గ్రామం చేరుకున్నారు. అనంతరం వీరభద్రస్వామి, కాళికాదేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ముఖాలకు స్వామి వారి విభూధి రాసుకుని, తిరిగి వెళ్లగానే పిడకల సమరం ప్రారంభానికి సూచికగా భక్తులు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు.

రెండు వర్గాలుగా విడిపోయి..

పిడకల సమరంలో భాగంగా భక్తులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఒక వర్గం భద్రకాళీదేవి తరుపున, మరొక వర్గం వీరభద్రస్వామి తరుపున సిద్ధమై ఆలయ ఆవరణలో రాసులుగా పోసిన పిడకలతో పరస్పరం కొట్టుకున్నారు. వందల సంఖ్యలో పిడకలు గాల్లోకి లేచి ప్రత్యర్థి వర్గాలపై పడుతుంటే ఉత్సాహం రెట్టింపు అయింది. పిడకల సమరంలో దుమ్ము ఆకాశాన్ని అంటింది. తమను తాము రక్షించుకుంటూ, ఎదుటివారిపై పిడికలు విసురుకుంటూ గుంపులు, గుంపులుగా వర్గీయులు కదిలారు. ఒకసారి ఒకవర్గానిది పైచేయి కాగా, మరోసారి మరోవర్గం వారిది పైచేయిగా నిలిచింది. తమ వర్గం వారు గెలవాలన్న తపనతో మహిళలు మేము సైతం అంటూ తమ వర్గీయులకు పిడకలు అందిస్తూ, సాయంగా నిలిచారు. రాసిగా వేసిన పిడకలు పూర్తిగా అయిపోయేంతవరకు గంట పాటు పోరు కొనసాగింది. పిడకల దెబ్బలకు కొందరి తలకు గాయాలు కాగా, మరి కొందరికి శరీరాలు కందిపోయాయి. సుమారు 20 మందికి గాయాలైనట్లు అంచనా.. సంగ్రామం ముగిసిన తరువాత గ్రామపెద్దలు ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర పంచాయితీ చేసి, కాళికాదేవి, వీరభద్రస్వామి వివాహానికి అంగీకారం తెలిపారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు తెలంగాణ రాష్ట్రంతో పాటు, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులతో పాటు కైరుప్పల చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు తరలివచ్చారు.



పిడకల సమరంలో కొట్టుకుంటున్న ఇరువర్గాలు, ఉత్సవంలో గాయపడ్డ యువకుడు

పోలీసుల ప్రత్యేక బందోబస్తు...

పిడకల సమరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యగా పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసు రెడ్డి ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆస్పరి, ఆలూరు, దేవనకొండ సీఐలు హనుమంతప్ప, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులుతో పాటు ఐదు మంది ఎస్ఐలు, 50మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఆలయ ఈవో రామ్‌ప్రసాద్, సర్పంచ్ తిమ్మక్క, డైరెక్టర్ బీటెక్ బద్రి, ఎంపీటీసీ లక్ష్మీ, లక్ష్మన్న, మాజీ సర్పంచ్ శరవన్న, మాజీ ఎంపీటీసీ రవీంద్ర, మాజీ డైరెక్టర్ ఉరుకుందు, బంట్రోతు శీనప్ప, వీరేష్, గోపాల్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత



స్వాధీనం చేసుకున్న అక్రమ నగదును చూపుతున్న డీఎస్పీ శివనారాయణ స్వామి

ఆదోని, ఏప్రిల్ 10: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఆదోని రైల్వేస్టేషన్ వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.37 లక్షల నగదును బుధవారం పోలీసులు పట్టుకున్నారు. కల్లుబావి కాలనీకి చెందిన మల్లికార్జున అనే వ్యక్తి ఆదోని నుండి కేరళకు వెళ్లేందుకు రైల్వేస్టేషన్ చేరుకున్నాడు. అదే సమయంలోనే టూటౌన్ సీఐ గోపీనాథ్, ఫ్లయింగ్ స్క్వాడ్ హరేంద్ర అనుమానాస్పద స్థితిలో తచ్చాడుతున్న మల్లికార్జునను గుర్తించి అతని బ్యాగును సోదా చేశారు. అందులో రూ.37 లక్షలు నగదు ఉన్నట్లు గుర్తించారు. అందుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడం వల్ల ఆ నగదును సీజ్ చేసినట్లు డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. ఈ నగదును ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగిస్తామని అన్నారు.

264 మంది వలంటీర్ల రాజీనామా

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 10: జిల్లాలో 11 మండలాల్లో బుధవారం నాటికి 264 మంది గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లు రాజీనామా చేశారని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన తెలిపారు. ఆస్పరిలో ఒకరు, ఆదోనిలో (5), కర్నూలు (1), పత్తికొండలో (32), కృష్ణగిరి (59), మద్దికెర (48), వెల్దుర్తి (37), తుగ్గలి (23), హాలహర్వి (1), ఓర్వకల్లులో (44), ఆలూరు (13) మంది.. మొత్తం 264 మంది వలంటీర్లు రాజీనామా చేశారని కలెక్టర్ వెల్లడించారు.

ప్రధాన పంట కాల్వకు గండి

మరమ్మతులకు నోచుకోని పంటకాల్వలు



అవుకు సమీపంలో ప్రధాన పంట కాల్వకు గండి

అవుకు, ఏప్రిల్ 10: అవుకు రిజర్వాయర్ అంతర్భాగమైన తిమ్మరాజు స్లూయిస్ నుంచి విడుదలయ్యే సాగునీటిని లోకల్ ఆయకట్టుకు తరలించే ప్రధాన కాల్వకు గండిపడింది. చాలా కాలంగా ఆలనపాలన లేక బుధవారం ఉదయం 11గంటల ప్రాంతంలో ఈ ప్రధాన కాల్వ కుంగిపోయి 10 అడుగుల మేర గండిపడింది. ఈ కాల్వ కింద 1614 ఎకరాల పొలం సాగవుతోంది. ఈ రబీ సీజన్‌లో రైతులు వరి పంటను సాగుచేశారు. స్లూయిస్ నుండి వస్తున్న నీరు గండిపడ్డ ప్రాంతం నుండి వరి పొలాల్లోకు వెళ్తుండడంతో రైతులు స్లూయిస్ గేట్లను మూసివేశారు. పంట కాల్వల్లోపూడిక చేరి ముళ్ల పొదలతో మూసుకుపోయాయి. పంట కాల్వకు 80శాతం మేర ఇరువైపుల రాతి కట్టడాలు లేకపోవడంతో రంధ్రాలు పడి నీరు వృథాగా పోతోంది. రంధ్రాలు పూడ్చుకునేందుకు రైతులు పడరాని పాట్లుపడుతున్నారు. ఈ గండిని ఎస్సార్బీసీ అధికారులు వెంటనే పూడ్చకపోతే వరిపంటకు నీరు అందక నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరమత్తులకు నిధులు మంజూరు కాలేదు

పంట కాల్వల మరమ్మతు కోసం రూ.5కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి 4 ఏళ్లక్రితమే పంపాం. ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. దీంతో మరమ్మతు పనులు చేపట్టలేకపోయాం. ప్రధాన పంట కాల్వకు పడ్డ గండిని పూడ్చే పనులు వెంటనే చేపడతాం. రెండు రోజుల్లో వరి పంటకు సాగు నీరు అందిస్తాం.

- శిఖామణి, ఎస్సార్బీసీ డీఈఈ, అవుకు

వైసీపీని వీడుతున్నారు..!

- ఆ పార్టీని వదిలేస్తున్న మేధావివర్గం
- టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం అంటున్న వైనం
- చంద్రబాబు సమక్షంలో రిటైర్డ్ డీఐజీ, ఎమ్మెల్సీ ఇక్బాల్ చేరిక
- లోకేశ్ సమక్షంలో చేరిన రిటైర్డ్ ఎస్ఈ కృష్ణారెడ్డి



మాజీ ఎమ్మెల్సీ, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఇక్బాల్ టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఆ పార్టీ అధినేత చంద్రబాబు

కర్నూలు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికార వైసీపీకి కీలక నాయకులు గుడ్‌బై చెబుతున్నారు. ఇటీవలి కాలంలో కీలక నేతలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నారు. నవ్యాంధ్ర అభివృద్ధి టీడీపీలోనే సాధ్యం.. సీఎం జగన్ విధానాలతో గాడి తప్పిన పాలనను సక్రమ మార్గంలో నడిపించడం టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు వల్లే అవుతుంది.. అభివృద్ధి, సంక్షేమం సమానంగా ముందుకు తీసుకెళ్లాలంటే చంద్రబాబు అనుభవం ఈ రాష్ట్రానికి ఎంతో అవసరం ఉందని వైసీపీలో ఉంటున్న మేధావివర్గం భావిస్తోంది. అందుకే ఆ పార్టీని ఒక్కొక్కరుగా వీడుతున్నారు. తాజాగా రిటైర్డ్ డీఐజీ, ఎమ్మెల్సీ షేక్ మహ్మద్ ఇక్బాల్, జలవనరుల శాఖలో సుదీర్ఘ అనుభవం కలిగిన రిటైర్డ్ సూపరింటెండెంట్ ఇంజనీరు (ఎస్ఈ), వైసీపీ సీనియర్ నేత కృష్ణారెడ్డిలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఇద్దరు చెబుతున్నది ఒక్కటే.. ఈ రాష్ట్రానికి జగన్ విధ్వంసకర పాలన నుంచి విముక్తి కలగాలి.. సుదీర్ఘ పాలన అనుభవం ఉన్న చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని. వీరి చేరికతో జిల్లాలో టీడీపీ బలం పెరిగిందని స్థానిక నాయకులు అంటున్నారు.

● చంద్రబాబు సమక్షంలో చేరిన ఇక్బాల్

ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన రిటైర్డ్ డీఐజీ (ఐపీఎస్), మాజీ ఎమ్మెల్సీ షేక్ మహ్మద్ ఇక్బాల్ వైసీపీకి రాజీనామా చేశారు. బుధవారం టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఆయన స్వగృహంలో టీడీపీలో చేరారు. ఆయనకు చంద్రబాబు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కర్నూలు డీఐజీగా రిటైర్మెంట్ పొందిన షేక్ మహ్మద్ ఇక్బాల్ గత ఎన్నికల్లో వైసీపీలో చేరారు. ఆ ఎన్నికల్లో శ్రీసత్యసాయి జిల్లా హిందుపురం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి నందమూరి బాలకృష్ణపై ఓడిపోయారు. ఈ ఎన్నికల్లోనూ హిందూపురం నుంచే ఆయన వైసీపీ టికెట్‌ను ఆశించారు. అయితే ఆ పార్టీ అధినేత, సీఎం జగన్ కనీసం కలిసేందుకు కూడా అవకాశం ఇవ్వలేదు. దీంతో విరక్తి చెందిన ఇక్బాల్ కొన్నాళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. అయితే రాష్ట్రంలో గాడి తప్పిన పాలనను సక్రమ మార్గంలో నడిపించడం చంద్రబాబు వల్లే సాధ్యమని గుర్తించిన ఆయన చంద్రబాబుకు మద్దతుగా టీడీపీలో చేరారు. ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసిన ఇక్బాల్ గత చంద్రబాబు ప్రభుత్వంలో కర్నూలు డీఐజీగా పని చేసి ఇక్కడే పదవీవిరమణ పొందారు. ఆదోని, కర్నూలు, మంత్రాయలయం నియోజకవర్గాల్లో ఇక్బాల్‌కు బంధువర్గం ఉంది. ఈ ఎన్నికల్లో టీడీపీ పక్షాన ప్రచారం నిర్వహిస్తే చేస్తే టీడీపీకి కలసి వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ముఖ్యంగా ముస్లిం మైనార్టీ వర్గాల ఓటర్లను టీడీపీకి అనకూలంగా మార్చగలదని ఆ పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

● కోడుమూరులో పెరిగిన టీడీపీ బలం

కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీ బలంగా ఉంది. టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ప్రచారంలో దూకుడు పెంచారు. ఇదే సమయంలో వైసీపీ నుంచి ముఖ్య నాయకులు టీడీపీలో చేరుతుండడంతో పార్టీ బలం మరింత పుంజుకుంటోంది. వైసీపీ ఆవిర్భావం నుంచి కోడుమూరు మండలంలో ఆ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేసిన ఆ పార్టీ సీనియర్ నాయకులు, జలవనరుల శాఖ రిటైర్డ్ ఎస్ఈ అమడగుంట్ల కృష్ణారెడ్డి వైసీపీని వీడారు. టీడీపీ మాజీ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డితో కలసి మంగళవారం హైదరాబాద్‌కు చేరుకున్న కృష్ణారెడ్డి, ఆయన అన్న కుమారుడు, వైసీపీ నాయకుడు చెన్నారెడ్డిలు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి యవనేత నారా లోకేశ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో వివిధ గ్రామాల నుంచి జడ్పీటీసీ, మాజీ జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు సహా వైసీపీ నాయకులు, వామపక్ష పార్టీ నాయకులు టీడీపీలో చేరుతున్నారు. తాజాగా కృష్ణారెడ్డి వంటి సీనియర్ నాయకులు టీడీపీలో చేరి వైసీపీకి ఊహించని షాక్ ఇచ్చారు.



యువనేత నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేత, రిటైర్డ్ ఎస్ఈ కృష్ణారెడ్డి

మోటారు సైకిళ్ల ప్రమాదంలో వ్యక్తి మృతి

బనగానపల్లె, ఏప్రిల్ 10: బనగానపల్లె పట్టణ శివారులోని ఆర్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్నాయి. బుధవారం జరిగిన ఈ ప్రమాదంలో చాగలమర్రికి చెందిన హోల్‌సేల్ బంగారు వ్యాపారి జమాల్‌బాషా (30) మృతి చెందాడు. చాగలమర్రి వాసి జమాల్‌బాషా బనగానపల్లెలో పని ముగించుకొని మోటారు సైకిల్‌పై వెళ్తుండగా, బనగానపల్లె పట్టణానికి చెందిన తిరుపాలు కోవెలకుంట్ల నుంచి బనగానపల్లెకు వస్తున్నాడు. వీరి వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో జమాల్‌బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. తిరుపాలుకు కాళ్లు విరిగిపోయాయి. ఈ ప్రమాదంలో మోటారుసైకిల్ నుజ్జునుజ్జు అయింది. జమాల్‌బాషా మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తిరుపాలుకు మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

13లోపు దరఖాస్తు చేసుకోవాలి

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 10: ఎసెన్షియల్ సర్వీసెస్‌లో ఉన్న ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోడానికి ఈ నెల 13 చివరి రోజు అని కలెక్టర్ డా.జి.సృజన తెలిపారు. బుధవారం ఎన్నికల అంశం, ఉపాధి పనులపై రిటర్నింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గ హెడ్ క్వార్టర్, తహసీల్దార్ కార్యాలయాల్లో, కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు నగరపాలక సంస్థ కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 13 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పనులు ఎందుకు ప్రారంభించలేదని అధికారులను ప్రశ్నించారు.

ఎండలతో అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 10: రానున్న రోజుల్లో మరింత అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జి. సృజన తెలిపారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో వడగాల్పుల తీవ్రత నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా స్థాయి అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి వడగాలుల్లో జాగ్రత్తగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఏప్రిల్‌లోనే 46, 47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, వచ్చే నెలలో 50 డిగ్రీలకు చేరే అవకాశం ఉన్నందున ప్రజలు ఇళ్లలోనే ఉండేలా చూడాలన్నారు. ఉపాధి హామీ కూలీలు ఉదయం 10 గంటలలోపు పనులు ముగించుకుని, మిగిలిన పని సాయంత్రం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ఏఎస్పీ నాగరాజు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, డీపీఎం అనుపమ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, డీపీవో నాగరాజు నాయుడు, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, వ్యవసాయాధికారి వరలక్ష్మి, డీఎంహెచ్‌వో ప్రవీణ్ కుమార్, సమాచార శాఖ ఏడీ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ లక్షణాలతో విద్యార్థి మృతి

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న సురేంద్రకుమార్(13) డెంగీ వ్యాధి లక్షణాలతో మృతి చెందినట్లు విద్యార్థి తల్లి దండ్రులు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన నాగన్న, వెంకటసుబ్బమ్మల కుమారుడు సురేంద్ర గత కొన్ని రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానిక వైద్యశాలల్లో చికిత్స అందించినా నయం కాలేదు. దీంతో నంద్యాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లగా అక్కడి వైద్యులు డెంగీ అని గుర్తించారు. అక్కడి నుంచి హైదరాబాదుకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఈ మేరకు ఈ నెల 8వ తేదీన హైదరాబాదులోని రెయిన్‌బో వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక 9వ తేది మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

హోరాహోరీగా పొట్టేళ్ల పోటీలు



పోటీల్లో తలపడుతున్న పొట్టేళ్లు

కోడుమూరు, ఏప్రిల్ 10: ఉగాది పండుగ పురస్కరించుకొని వల్లెలాంబదేవి అమ్మవారి ఉత్సవాలు సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పొట్టేళ్ల పోటీలు చేపట్టారు. ఈ పోటీలకు జిల్లాలోని కాకుండా తెలంగాణ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున పొట్టేళ్లు తరలి వచ్చాయి. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పోటీలను తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ పోటీలల్లో తెలంగాణకు చెందిన ఐజ నరసింహులు పొట్టేలు మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానం లో నంద్యాలకు చెందిన చోటు అనే వ్యక్తి పొట్టేళ్ల, మూడో స్థానంలో నంద్యాలకు చెందిన కాశీ, నాల్గవ స్థానంలో ఐజ గ్రామానికి చెందిన ప్రవీణ్, ఐదో స్థానంలో తిమ్మాపురం గ్రామానికి చెందిన భైరవ, ముడుమలగుర్తి గ్రామానికి చెందిన నాగరాజుకు చెందిన పొట్టేళ్ల నిలిచాయి. విజేతలైన పొట్టేళ్ల యజమానులకు వరుసగా రూ.20వేలు, రూ.15, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేల నగదును బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, హనుమంతు, మాల్లారెడ్డి, శివరాముడు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు పెంచలయ్య, తదితరులు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 10: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు ను వినియోగించుకోవాలని సోషల్ డెవపలప్‌మెంట్ స్పెషలిస్టు పెంచలయ్య పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి.సృజన, కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవ తేజ ఆదేశాల మేరకు బుధవారం నగర పాలక సంస్థ అధ్వర్యంలో బుధ వారం స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఉస్మానియా కళాశాల నుంచి గఫార్ వీధి, ఐడియల్ పాఠశాల, రంగరాజువీధి, జొహరాపురం రోడ్ బేకారీకట్ట, మోతియా స్కూల్, రాములవారి గుడి, దండిగేరి మీదుగా బుధవారపేట బ్రిడ్జి వరకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనం తరం ఓటు హక్కు వినియోగంపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు, సీఓలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకుడు చంద్ర రాజేశ్వరరావు



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 10: కమ్యూనిస్టు నేత చంద్ర రాజేశ్వరరావు నిస్వార్థ సేవకుడని సీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కే.జగన్నాథం అన్నారు. చంద్ర రాజేశ్వరరావు 30వ వర్ధంతిని పురస్కరించుని బుధవారం సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం వృద్ధాశ్రమాలలో వృద్ధులకు పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో సాధారణ కార్యకర్త స్థాయి నుంచి జాతీయస్థాయి ప్రధాన కార్యదర్శిగా అనేక సంవత్సరాలు ఎలాంటి స్వార్థం లేకుండా సేవలందించిన నాయకుడు అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి మహేష్, కార్యవర్గ సభ్యుడు నాగరాజు, సమితి సభ్యుడు శివప్రసాద్, సురేంద్ర పాల్గొన్నారు.

జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ప్రారంభించిన కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 10: కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో ఆధునీకీకరించిన జిల్లా మైనార్టీల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని బుధవారం కలెక్టర్ జి.సృజన ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్వో కే.మధుసూదన్‌రావు, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి సునీల్, ఏపీ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ సబీహా పర్వీన్, మైనార్టీ వెల్ఫేర్ కార్యాలయ సూపరింటెండెంట్ శ్యాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: టీజీ భరత్



మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 10: చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందు తుందని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. నగరంలోని సి.క్యాంప్‌లోని ప్రభుత్వ పెన్షనర్ల జిల్లా కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగులతో టీజీ భరత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన అనంతరం రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ ఉద్యోగుల విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ ఐదేళ్లలో రాష్ట్రం ఎంతో వెనుకబడి పోయిందన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్రమణ్యం, ట్రెజరర్ రాజారావ్, మాజీ అధ్యక్షుడు మద్దిలేటి రెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ పాపారావు, రిటైర్డు జైళ్ల శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ పక్కీరయ్య, రిటైర్డు ఆర్టీవో శ్రీధర్, ఆర్జా రామకృష్ణ పాల్గొన్నారు.

ఈ ఐదేళ్లలో నష్టాన్ని గుర్తించండి: ఈ ఐదేళ్లలో ఎంతో నష్టపోయామో ప్రతి ఒక్కరూ గుర్తించాలని టీజీ భరత్ అన్నారు. బుధవారం నగరంలోని ఏ క్యాంప్ మాంటిస్సోరీ పాఠశాలలో సిబ్బందితో నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. చదువుకున్న ప్రతి ఒక్కరూ గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైసీపీ పాలనకు తేడా గమనించాలని కోరారు. పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

● **రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలి:** ముస్లింలు రంజాన్ పండుగా సంతోషంగా జరుపుకోవాలని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. బుధవారం నగరంలోని ఆనంద్ టాకీస్ సమీపంలోని పాత ఈద్గాలో ఆయన ప్రార్థనలు చేశారు. ఉపవాస దీక్ష విరమింపజేశారు. ఈసందర్భంగా ఆయన ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య దర్శి అబ్దుల్ రజాక్, జనసేన కర్నూలు ఇన్‌చార్జి హర్షద్, టీడీపీ నాయకులు రాజశేఖరరెడ్డి, సురేష్ పాల్గొన్నారు

అర్హులందరికీ టిడ్కో ఇళ్లు: కర్నూలు నియోజకవర్గంలో అర్హులందరికీ టిడ్కో ఇల్లు అందజేస్తానని టీజీ భరత్ అన్నారు. బుధవారం నగరంలోని 52వ వార్డులోని సాయిబాబా నగర్, సంజీవనగర్, ఎల్‌బీఎస్ నగర్‌లో టీజీ భరత్ భరోసా యాత్ర నిర్వహించారు. ప్రజలు ఇళ్లు, ఇళ్ల పట్టాలు, పెన్షన్లు, డ్రైనేజీ, తదితర సమస్యలను ఆయనకు మొరపెట్టుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోపు కర్నూలుకు హైకోర్టు బెంచ్ తప్పకుండా తీసుకోస్తానని అన్నారు. న్యాయవాదులంతా టీడీపీకి మద్దతు తెలిపాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు బోల్లెద్దుల రామక్రిష్ణ, నాగన్న, వేణుగోపాల్, కేవీ శ్రీనివాసులు, వి.శ్రీని వాసులు, రంగస్వామి, హనుమంతరెడ్డి, అంజీ, చాంద్‌బాషా, శాంతప్ప, సిద్దయ్య, సర్దార్, జనసేన రాయలసీమ ఎన్నికల కన్వీనర్ పవన్, అనిత పాల్గొన్నారు.



ముస్లింలకు ఖర్జూరం పండు తినిపిస్తున్న టీజీ భరత్

పీఓలు, ఏపీఓల పాత్ర కీలకం: ఆర్వో

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 10: ఎన్నికల నిర్వహణలో పీఓలు, ఏపీఓల పాత్ర కీలకమని కర్నూలు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవతేజ అన్నారు. బుధవారం నగరంలోని తనీష్ కన్వెన్షన్ హాలులో సాధారణ ఎన్నికలు-2024 పీఓలు, ఏపీఓల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవతేజ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల దృష్ట్యా కొత్తగా వచ్చిన నియమాలపై మరింత అవగాహన పెంచుకోవాలని అన్నారు. రానున్న సాధారణ ఎన్నికల పోలింగ్ మే 13న ఉంటుందని, సంబంధిత పోలింగ్ ప్రక్రియ కార్యక్రమంలో ముఖ్యంగా పీఓ, ఏపీఓలకు ఈవీఎం మిషన్ కనెక్షన్ల నిర్వహణ, పలు అంశాలపై అవగాహన ఉండాలని ఆయన సూచించారు. ఈ ఎన్నికల్లో విధులు నిర్వహించే పీఓ, ఏపీఓలు తమ రాజ్యాంగబద్ధ బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో వచ్చిన హ్యాండ్ బుక్స్‌ను పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా చదువుకొని, అవగాహన చేసుకోవాలని నాన్నారు. ఈవీఎం మిషన్ సెట్ విత్ కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్ మిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈవీఎం మిషన్ ఏ విధంగా కనెక్ట్ చేయాలనే దాన్ని ప్రతి ఒక్కరూ నేర్చుకోడానికి ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి రవాణా, భోజన సదుపాయంతోపాటు అవసరమైన పర్నీచర్‌ను కూడా పూర్తిస్థాయిలో అందజేస్తామని, మే 12న సాయంత్రం నాటికి అన్నిటినీ ఆర్గనైజ్ చేసుకోవాలన్నారు.



ఈవీఎంల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న ఆర్వో ఎ.భార్గవతేజ

గౌరు దంపతుల రంజాన్ శుభాకాంక్షలు



కల్లూరు, ఏప్రిల్ 10: పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి దంపతులు బుధవారం ఒక ప్రకటనలో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్‌ను ముస్లింలంతా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. నెలరోజుల పాటు భక్తిబావంతో కఠోర ఉపవాస దీక్ష అనంతరం ముస్లింలు రంజాన్ పండుగను జరుపుకుంటున్నారని, వారందరికి అల్లాహ్ దీవెనలు తప్పకుండా అందుతాయని వారు ఆకాంక్షించారు.

మూడురోజుల ముందు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయాలి : జేసీ



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 10: బీఎల్వోలు పోలింగ్‌కు మూడు రోజుల ముందు ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. బుధవారం గుత్తిరోడ్డులోని కేవీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి సాధారణ ఎన్నికలు-2024 నిర్వహణపై బూత్ లెవెల్ స్థాయి అధికారులకు, పీవోలు, ఏపీవోలకు నియోజకవర్గస్థాయిలో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది ఎన్నికల కమిషన్ ఇచ్చిన మార్గనిర్దేశకాలను పాటించాలని సూచించారు. పోలింగ్ రోజున బీఎల్వోలు, సెక్టార్ ఆఫీసర్లు ఈవీఎంలను కనెక్ట్ చేయడం, తొలగించడం, మాక్ పోల్ నిర్వహణ, మాక్ పోల్ స్లిప్స్ నిర్వహణ, మాక్ పోల్ క్లియర్ చేయడం మొదలైన వాటిపై , అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికలకు సంబంధించి సీ-విజిట్, టోల్‌ఫ్రీ నెంబర్‌కు వచ్చిన ఫిర్యాదును వంద నిమిషాల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో గడివేముల, పాణ్యం, ఓర్వకల్లు, కల్లూరు మండలాల తహసీల్దార్లు, పీవోలు, ఏపీవోలు, సెక్టార్ ఆఫీసర్లు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

21న నగర స్థాయి చిత్రలేఖన పోటీలు

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 10: ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21న ఉదయం 9 గంటలకు 'ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్' అనే అంశంపై నగర స్థాయి చిత్రలేఖన పోటీలు ఏర్పాటు చేసినట్లు రాయపాటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నుంచి పదేళ్ల లోపు చిన్నారులను సబ్ జూనియర్స్‌గా, 11 నుంచి 15 ఏళ్ల లోపు వారిని జూనియర్స్‌గా, 15 ఏళ్లు పైబడిన వారిని సీని యర్స్‌గా పరిగణిస్తామని తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతు లతోపాటూ కన్సొలేషన్ నగదు బహుమతులు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 15లోగా నగరంలోని వీఆర్ కాలనీ, మొదటి లైన్‌లో గల నైస్ కంప్యూటర్స్ శిక్షణ కేంద్రంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

మునగాలపాడులో వైసీపీకి షాక్

150 మంది టీడీపీలో చేరిక



విష్ణు సమక్షంలో టీడీపీలో చేరిన మునగాలపాడు వైసీపీ నాయకులు

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 10: కోడుమూరు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత మణిగాంధీ స్వగ్రామం కర్నూలు అర్బన్ మండలంలోని మునగాలపాడులో ఆ పార్టీకి షాక్ తగిలింది. మునగాలపాడుకు చెందిన దాదాపు 150 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి బుధవారం కర్నూలులో టీడీపీ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కోడుమూరులో టీడీపీ జెండాను ఎగరవేయాలని పిలుపునిచ్చారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన సచివాలయ కన్వీనర్ మహేష్‌గౌడ్, నాయకులు మాస్టిక్ సుంకన్న మాట్లాడుతూ వైసీపీలో బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగడం లేదన్నారు. గ్రామంలో మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే సుధాకర్ దృష్టికి తీసుకెళ్ళిన పరిష్కరించలేదన్నారు. అందుకే విష్ణుపై నమ్మకంతో టీడీపీలో చేరుతున్నట్లు వారు వివరించారు. టీడీపీలో చేరిన వారిలో ఎల్లాగౌడ్, అరవింద్, సందీప్, వంశీ, రాకేష్, శ్రీధర్, సాయి, సుమన్, వాహిద్, విక్కి ఉన్నారు.

15 నుంచి ఖాద్రీ బడేసా ఉరుసు

సి.బెళగల్, ఏప్రిల్, 10: మండలంలోని గుండ్రేవుల గ్రామంలో వెలసిన సయ్యద్ ఖాద్రీ బడేసా ఉరుసు ఉత్సవాలు ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని దర్గా పీఠాధిపతులు సయ్యద్ రసూల్, సయ్యద్ బాబు ఖాద్రీలు తెలిపారు. ఈనెల 15న గంధం, 16న ఉరుసు, 17న జియారత్ ఉంటాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు ఉమ్మడి కర్నూలు జిల్లాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, గుజారాత్, తెలంగాణ రాష్ట్రాలలో నుంచి భక్తులు తరలివస్తున్నట్లు పీఠాధిపతులు తెలిపారు.

సూపర్ సిక్స్ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగు



బూడిదపాడులో ప్రచారం చేస్తున్న బొగ్గుల దస్తగిరి

గూడూరు, ఏప్రిల్ 10: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు పేదల జీవితాల్లో వెలుగు నింపుతుందని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. బుధవారం మండలంలోని బూడిదపాడులో ఆయన ఇంటింటి ప్రచారం చేసి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బంగారు శ్రీను, రాముడు, వీరన్న, బాస్కర్, నరసింహులు, ఏసన్న, కాడప్ప, జె సురేష్, గోపాల్ రెడ్డి, మహేశ్వర రెడ్డి, మద్దిలేటి, కృష్ణ, రవి, గిడ్డయ్య, విష్ణు సేన అభిమానులు పాల్గొన్నారు.

● **బూడిదపాడులో జయహో బీసీ:** మండలంలోని బూడిదపాడు గ్రామంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి పాల్గొని మాట్లాడారు. రాజకీయంగా బీసీలకు పెద్దపీట వేస్తుంది కేవలం టీడీపీ అధినేత చంద్రబాబు మాత్రమేనని అన్నారు.

తెలుగు డీటీపీలో ఉచిత శిక్షణ

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 10: అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా 117ఎస్, అలియన్స్ క్లబ్ ఆఫ్ గ్రేటర్ కర్నూలు, నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు తెలుగు డీటీపీలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు లయన్స్ క్లబ్ అడిషనల్ క్యాబినేట్ సెక్రటరీ, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. అభ్యర్థులు కనీసం 7వ తరగతి విద్యార్హత కలిగి, ఎమ్మెస్ ఆఫీస్‌పై పరిజ్ఞానం ఉండాలని, ఆసక్తిగల అభ్యర్థులు తమ ఆధార్ జీరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో నగరంలోని వెంకటరమణ కాలనీ, మొదటి లైన్‌లోగల నైస్ కంప్యూటర్స్ శిక్షణ కేంద్రంలో ఈనెల 15లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల17 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, వివరాలకు 93968613084లో సంప్రదించాలని సూచించారు.

బీసీలకు 50 ఏళ్లకే పింఛన్

» టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఏప్రిల్ 10: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే బీసీలకు 50 ఏళ్లకే రూ.4వేలు పింఛన్ అందజేస్తామని పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని హుశేనాపురంలో జయహో బీసీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీసీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈసందర్భంగా మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ బీసీలకు తెలుగుదేశం పార్టీ ఒక విశ్వవిద్యాలయం లాంటి దన్నారు. టీడీపీ బీసీల సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేస్తామన్నారు. బీసీలపై వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి జైలులో వేయడమే కాకుండా, వారిని ఇబ్బందులకు గురి చేసిందన్నారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షు డు మల్లికార్జున, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు మహబూబ్ బాషా, సుధాకర్, మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రాము, చంద్రపెద్దస్వామి, బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, నాగమల్లేష్, షమీనా, వెంక టరమణ, గోపాల్, మధుసూదన్‌గౌడు, మహేష్‌గౌడు, వెంకటసుబ్బయ్య, రామగోవిందు, బజారు, వేణు, జయక్రిష్ణ, రవి, నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

వైభవంగా గిడ్డాంజనేయస్వామి ప్రభోత్సవం



వెంకటగిరిలో ప్రభోత్సవానికి తరవచ్చిన భక్తులు

కోడుమూరు(రూరల్), ఏప్రిల్ 10: మండలంలోని వెంకటగిరి గ్రామంలో గిడ్డాంజనేయ స్వామి ప్రభోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉగాది వేడుకలను పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజలు చేపట్టారు. భూదేవి, శ్రీదేవి సహిత విష్ణుమూర్తి విగ్రహాలను ప్రభపై కొలువుంచి మేళతాళాల మధ్య వీధులలో ఊరేగించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు పారువేట చేపట్టారు. ఈవేడుకను తిలకించేందుకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. అలాగే వర్కూరు గ్రామంలో శ్రీలక్ష్మీ మాధవస్వామికి గ్రామోత్సవం, వసంతోత్సవం చేపట్టారు.

కర్ణాటక భక్తులకు అన్నదానం



కర్ణాటక భక్తులకు అన్నం వడ్డిస్తున్న దాతలు

ఓర్వకల్లు, ఏప్రిల్ 10: మండలంలోని నన్నూరు గ్రామంలో కర్ణాటకకు చెందిన భక్తులకు బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కర్ణాటక భక్తులు శ్రీశైలం, మహానంది క్షేత్రాలను దర్శించుకుని తిరుగు ప్రయాణంలో నన్నూరు మీదుగా వెళ్తున్న వారికి నన్నూరు గ్రామ పెద్దలు, ముస్లిం మైనార్టీ నాయకులు అన్నదానం చేశారు.

13న సీతారాముల కల్యాణం

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 10: సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 13న నగరంలో సీతారాముల కల్యాణ్యాన్ని నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్ష, కార్యదర్శులు కె. క్రిష్ణన్న, ఎం. నాగోజీ రావు, కోశాధికారి కల్కి మురళీకృష్ణ తెలిపారు. బుధవారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కల్యాణోత్సవ ఆహ్వాన పత్రికలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామనవమిని పురస్కరించుకొని ఏటా సమితి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా ఈ ఉత్సవాలు ఈనెల 11 నుంచి నగరంలో వెంకటేశ్ టాకీస్ పక్కన గల గోశాలలో ప్రారంభమవుతాయని తెలిపారు. 11న సాయంత్రం 6 గంటలకు పసుపు, తలంబ్రాల సేవ, 12న ఉదయం స్వామి, అమ్మవార్లకు తిరుమంజన సేవ ఉంటాయని, 13న సాయంత్రం 5 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 6 గంటల నుంచి టీటీడీ వ్యాఖ్యాత డాక్టర్ దీవి హయగ్రీవాచార్యతో ధార్మిక ప్రవచనము, ఉపన్యాసాలు, రాత్రి 7 గంటలకు సీతారాముల కల్యాణం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సమితి ఉపాధ్యక్షులు ఎస్‌వీ నారాయణరెడ్డి, ఎస్ మహాబలేష్, సంయుక్త కార్యదర్శులు సగరం నరేష్ కుమార్, జే గోపీనాథరావు, ఎన్ మల్లికార్జున, కే అచ్చి, వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు టీసీ మద్దిలేటి పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు శ్రీరామచంద్రమూర్తి



ప్రవచనం చెబుతున్న కర్నాటి చంద్రమౌళిని

కర్నూలు(కల్చరల్) ఏప్రిల్ 10: ఆదర్శనీయుడు శ్రీరామచంద్ర మూర్తి అని తెలుగు పండితులు, ధార్మిక ఉపన్యాసకులు డా.కర్నాటి చంద్రమౌళిని అన్నారు. తిరుమల, తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని శ్రీరాంబోట్ల దేవస్థానంలో ఏర్పాటు చేసిన శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు బుధవారం శ్రీరామనవమి విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకుడు డా.మల్లు వెంకటరెడ్డి, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ నగరూరి దీప్తి, కార్పొరేటర్ నగరూరి శ్రీనివాసులు, ఆలయ కార్యనిర్వహణాధికారి దినేష్, అర్చకులు గిరిశర్మ, మహాలక్ష్మి, కృష్ణకాంత్, సిబ్బంది పెద్ది శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, మల్లేష్, రామ్మోహన్ పాల్గొన్నారు.

ఎథికాఫ్‌లో దేవుని వేడుకొనే అవకాశం



ముస్లిం మహిళలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న మీసాల సుమలత

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 10: రంజాన్ మాసంలో చివరి పది రోజులు మహ్మద్ ప్రవక్త ఎథికాఫ్ పాటించే వారని, విధేయతతో దేవుని వేడుకునే అవకాశం ఎథికాఫ్‌లో దొరుకుతుందని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత అన్నారు. బుధవారం సాయంత్రం రంజాన్ మాసం చివరి రోజు సందర్భంగా నిరుపేద ముస్లిం మహిళలకు నిత్యావసర సరుకులను ఆమె ఉచితంగా అందజేశారు. నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ రంజాన్ మాసంలో మసీదులో ఏకాంత ఆరాధనలో లీనమవడం వల్ల మానసిక అలజడుల నుంచీ రక్షణ పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ముస్లిం మైనారిటీలు అస్మత్ బీ, ఫరీదా, ముంతాజ్, మహబూబ్ బీ, విశ్వకర్మ పాల్గొన్నారు.

తాగునీటి విడుదలపై కృతజ్ఞతలు

కోడుమూరు(రూరల్), ఏప్రిల్ 10: మండలంలోని అమడగుంట్లలో కుంటలకు తాగునీరు విడుదల చేయించడంపై గ్రామ టీడీపీ నాయకులు బుధవారం మాజీ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి, కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు రమేష్, సురేష్, శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కుంటలు ఎండిపోవడంతో మూగజీవాలకు తాగునీరు లేక ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. దీంతో విష్ణువర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో, ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి ఎల్లెల్సీ కాలువ నీరు విడుదల చేయించారని పేర్కొన్నారు. దుర్గమ్మ కుంట, నాగుల కుంటలకు నీరు చేరడంతో మూగజీవాలకు తాగునీటి కొరత తీరడంతోపాటు భూగర్భజలాలు పెరిగి బోర్లు రీచార్జి అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో రవికిషోర్, శంకరరెడ్డి, గోపాల్, శ్రీనివాసులు, వై వెంకటేశ్వర్లు, దేవేంద్రుడు, కోనప్ప, గిడ్డయ్య, రవికుమార్, మహ్మద్, మధుబాబు పాల్గొన్నారు.

పత్తికొండను అభివృద్ధి పథంలో నడిపిస్తా

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 10: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను ఆదరించి అసెంబ్లీకి పంపిస్తే వెనుకబడిన పత్తికొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని బీసీవై పార్టీ అభ్యర్థి మిద్దె వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పత్తికొండ పట్టణంలో బీసీవై పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బీసీవై నాయకులు సత్తార్‌వలి, లక్ష్మణ స్వామి, చెన్నకేశవులు ఆయనను పూలమాలతో సత్కరించారు.

తుగ్గలి, ఏప్రిల్ 10: ఎద్దులదొడ్డికి చెందిన యువత వెంకట్రాముడు, చెన్నకేశవులు, తేజతోపాటు పలువురు బీసీవై పార్టీ పత్తికొండ అభ్యర్థి మిద్దె వెంకటేశ్వర్లు యాదవ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సుధాకర్, నరసింహులు, రషీద్, సత్తార్‌వలి, లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి మండలంలో శంఖారావం

తుగ్గలి, ఏప్రిల్ 10: గురువారం నుంచి మండలంలో శంఖారావం కార్యక్రమం నిర్వహిస్తున్నామని టీడీపీ మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు తెలిపారు. బుధవారం రాంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో నిర్వహించే శంఖారావం, జయహో బీసీ కార్యక్రమాలకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కేఈ శ్యాంబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. గురువారం బొందిమడుగుల, నల్లగుండ్ల, 12వ తేదీన జొన్నగిరి, చిన్న జొన్నగిరి, దేశాయితండా, 13న ఉప్పర్లపల్లి, సూర్యతండా, మీటతండా, 14న కడమకుంట్ల, రోళ్లపాడుతండా, ఎల్లమ్మగుట్ట తండా, 15న అమినాబాదు, గిరిగిట్ల, 16న జొన్నగిరి, కేపీ గుడిసెల, 17న జాప్రాతండా, లక్ష్మీతండా, చిగురుగుట్ల తండా, మిద్దె తండాలలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పండి

మద్దికెర, ఏప్రిల్ 10: రాష్ట్రంలో ఐదేళ్ల పాటు రాక్షస పాలన సాగించిన వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ సర్పంచు వెంకటవర్మ, మెడికల్ తిమ్మప్ప, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పెరవలి రామాంజులు, జిల్లా సాధికారికత యాదవ సంఘం కార్యదర్శి మూలింటి రంగస్వామి అన్నారు. బుధవారం పెరవలి గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతాయని వివరించారు.

పోరాడే నాయకులను చట్టసభలకు పంపండి: సీపీఐ

వెల్దుర్తి, ఏప్రిల్, 10 : నిరంతరం ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించే కమ్యూనిస్టు నాయకులను చట్టసభలకు పంపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే.జగన్నాథం అన్నారు. గురువారం సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ ఆధ్వర్యంలో వెల్దుర్తిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రశ్నించే గొంతుకలను చట్టసభలకు పంపినప్పుడే ప్రజాసమస్యలు పరిష్కరింపబడతాయన్నారు. రాబోయే ఎన్నికల్లో కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి పత్తికొండ సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి రామచంద్రయ్యను గెలిపించాలని కోరారు.

ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి : ఆర్వో

మంత్రాలయం, ఏప్రిల్ 10: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళి అన్నారు. బుధవారం మంత్రాలయంలోని టీటీడీ కళ్యాణ మండపంలో మంత్రాలయం నియోజకవర్గంలోని సెక్టోరియల్ పీవో, ఏపీవోలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం అసిస్టెంట్ ఆర్వో శ్రీధర్‌మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. తహసీల్దార్లు సురేష్‌బాబు, అలెగ్జాండర్, డిప్యూటీ తహసీల్దార్లు రాఘవేంద్ర, గురురాజురావు, శశిశేఖర్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్/రూరల్, ఏప్రిల్ 10: పట్టణంలోని మాచాని బాలికల జూనియర్ కళాశాలలో ఎమ్మిగనూరు ఆర్వో చిరంజీవి ఆధ్వర్యంలో 144-అసెంబ్లీ ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు,పోలింగ్ సిబ్బందికి శిక్షణాకార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల రోజు ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. తహసీల్దార్ శేషారెడ్డి, ఎన్నికల డీటీ రఘువీర, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

● **ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు :** అత్యవసర విభగాలకు చెందిన, ఎన్నికల విధుల్లో నియమితులైన ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియెగించుకునేందుకు ఫారం 12, ఫారం 12డీలను తహసీల్దార్ కార్యాలయంలో 13వ తేదిలోపు దాఖలు చేసుకోవచ్చని ఆర్వో చిరంజీవి తెలిపారు. ఇందుకు గాను తహశీల్దార్ కార్యాలయం దగ్గర ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోండి

ఆలూరు, ఏప్రిల్ 10: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు తప్పకుండా పోస్టల్ బ్యాలెట్ కోసం ఈ నెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామునాయక్ అన్నారు. బుధవారం ఆలూరు జూనియర్ కళాశాల మైదానంలోని ఆర్‌డీటీ భవన్‌లో నియోజకవర్గ స్థాయి ఎన్నికల విధులు, బాధ్యతలపై శిక్షణ, మాక్ పోలింగ్ నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకొనే సిబ్బంది నియోజకవర్గ కేంద్రంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని, వారికి ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు వేసే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 10: స్థానిక గోపాల్ ప్లాజాలో పత్తికొండ అసెంబ్లీ నియోజకవర్గ పీవో, ఏపీవోలకు ఎన్నికల నిర్వహణపై పత్తికొండ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ రామరాజుతో పాటు వివిధ మండలాల తహసీల్దార్లు, పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

ఆట వస్తువులు పంపిణీ

చిప్పగిరి, ఏప్రిల్ 10: స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్లు నయామతుల్లా, రవి రూ.30 వేల విలువ చేసే ఆట వస్తువులు ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వెళ్లిన క్రీడాకారులే అంతర్జాతీయ క్రీడల్లో రాణిస్తున్నారని అన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే మంచి ఆటగాళ్లుగా తయారవుతారని పేర్కొన్నారు.

దళిత మహిళపై దాడి

● నలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

మంత్రాలయం, ఏప్రిల్ 10: మండలంలోని కల్లుదేవకుంట గ్రామంలో తాగునీటి ట్యాంకు వద్ద నీరు పట్టుకునే విషయంలో దళిత మాల ఉష అనే మహిళపై అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు బుధవారం దాడి చేశారు. సీఐ ఎరిషావలి, ఏఎస్ఐ ఆనంద్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు గ్రామంలో తాగునీటి విషయమై ట్యాంకు వద్ద నీరు పట్టుకునే విషయంలో ఉషపై అదే గ్రామానికి చెందిన కురువ హనుమంతు, లక్ష్మీకాంత్, సోమేష్, వేణులు దాడికి పాల్పడ్డారు. గాయపడిన మహిళను చికిత్స నిమ్మితం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తెలుగు ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

మద్దికెర, ఏప్రిల్ 10: మద్దికెర గ్రామంలోని ఏఎస్ఐ ఫణిరాజు, పోలీసు చంద్రశేఖర్, త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు పండుగను, తెలుగు సంప్రదాయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. కార్యక్రమంలో పలువురు భక్తులు ఉన్నారు.

ఉత్సాహంగా వసంతోత్సవం

గోనెగండ్ల, ఏప్రిల్ 10: ప్రతి ఏటా ఉగాది పండుగ మరుసటి రోజు వసంతోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహిస్తారు. బుధవారం పలు గ్రామాల్లో ని యువత రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. ఉదయం నుంచి అయా గ్రామాల్లోని దేవాలయాల్లో వీరశైవమఠం పీఠాధిపతి శివయ్య స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గోనెగండ్లలో సీతారామాంజనేయ ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగిస్తూ యువకులు, పిల్లలు వసంతోత్సవంలో పాల్గొన్నారు. గోనెగండ్ల అంజనేయస్వామి దేవాలయం నుంచి ఈశ్వరదేవాలయం వరకు కోలాటం నందికోలు సేవల సాగుతుండగా ఘనంగా ప్రభోత్సవం నిర్వహించారు. ఎలాంటి అవాంచనీ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, డీటీ గురురాజారావు, భాస్కర్‌రెడ్డి, గోవిందు, దొరబాబు, టీడీపీ సాంస్కృతిక విభాగం కర్నూలు పార్లమెంట్ విభాగం ప్రధాన కార్యదర్శి కౌలుట్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బైలుప్పలలో: బైలుప్పలలో ఉగాది ఉత్సవాలలో భాగంగా చెన్నకేశవస్వామి జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతోత్సవాన్ని జరుపుకున్నారు. అలాగే సాయంత్రం 100 అడుగుల ప్రభను ప్రత్యేకంగా అలంకరించి ఆంజినేయ స్వామి దేవాలయం నుంచి ఈశ్వరదేవాలయం వరకు ప్రభోత్సవం నిర్వహించారు.

పెద్దనేలటూరులో చెన్నకేశవస్వామి జాతర : పెద్దనేలటూరు గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకొని చెన్నకేశవస్వామి జాతర నిర్వహించారు. రెండురోజుల పాటు గ్రామంలో ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వసంతోత్సవం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. అలాగే సాయంత్రం ప్రభను ప్రత్యేకంగా అలంకరించి ప్రభోత్సవం జరిపారు.


పెద్దనేలటూరులో సాగుతున్న చెన్నకేశవస్వామి ప్రభోత్సవం


బైలుప్పలలో 100 అడుగుల ప్రభను ఊరేగిస్తున్న గ్రామస్థులు

ముగిసిన ఉగాది ఉత్సవాలు

మద్దికెర : ఉగాది పండుగ అంటే రైతులకు ఎంతో ఇష్టమైన పండుగ.. రైతులు తమ పొలాలకు వెళ్లి భూమాతకు ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. బుధవారం ఉత్సవాల ముగింపు సందర్భంగా మండలంలో రైతులు బండలాగుడు పోటీలు నిర్వహించారు.


మద్దికెరలో కుందేళ్లను పరుగుపందేనికి సిద్ధం చేస్తున్న యువకులు

ఆనవాయితీగా వస్తున్న కుందేళ్ల పరుగు పందెం

పెరవలి గ్రామంలోని రంగనాథ స్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి పారువేట మహోత్సవాలు, కుందేళ్ల పరుగు పందేలు కన్నుల పండువగా జరిగాయి. ఉత్సవమూర్తులను పల్లకీలో పెట్టి మేళతాళాలతో గ్రామ శివారులో బస్టాండు దగ్గర ఉన్న చెరువులో పారువేట కట్టమీద ఉత్సవ విగ్రహాలకు పూజలు చేసి అనంతరం ప్రజలు కుందేళ్ల పరుగు పందేలను సరదాగా నిర్వహించారు. ఆనవాయితీగా ప్రతి ఏడాది పారువేట ఉత్సవాలను నిర్వహిస్తారు. ప్రజలు సరదాగా తెచ్చుకున్న కుందేళ్లకు ఆ ప్రాంతంలో పోటీలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఈడిగ దస్తగిరి గౌడు, ప్రధాన అర్చకులు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సవారమ్మ దేవర

పత్తికొండ టౌన్ : పట్టణంలో ఆదోని రోడ్డులోని సవారమ్మ దేవర బుధవారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్ ప్రాంతాలకు చెందిన ప్రజలు సవారమ్మ దేవాలయానికి బోనాలతో మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ముస్లింలకు టీడీపీ నేతల ఇఫ్తార్ విందు



ఆలూరులో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తున్న వీరభద్రగౌడ్, కోసిగి నూరాని మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న తిక్కారెడ్డి

ఆలూరు, ఏప్రిల్ 10: ఆలూరు పట్టణంలోని జామియా మసీదులో బుధవారం రాత్రి ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింల సంక్షేమానికి టీడీపీ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అనంతరం వీరభద్ర గౌడును స్థానిక ముస్లింలు సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణ, బెంగళూర్ కిషోర్, మన్సూర్ వల్లి, కిట్టు, కొమ్ము రామాంజినేయులు. నెట్టప్ప తదితరులు పాల్గొన్నారు

కోసిగి : కోసిగిలోని నూరాని మసీదులో ముస్లింలకు టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి ఇఫ్తార్ విందు ఇచ్చారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఎంతో శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు తిక్కారెడ్డిని శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాపురం సుదీర్ రెడ్డి, అయ్యన్న, వక్రాణి వెంకటేశ్, నాడిగేని రంగన్న, పెండ్యాల భరద్వాజ్‌శెట్టి, మహదేవ, వీరారెడ్డి, రవితేజ శెట్టి,, ఈరయ్య, పంపాపతి, ఖలందర్, ఎంపీటీసీ రాజు, మారేష్ పాల్గొన్నారు.

నేడు టీడీపీ నియోజకవర్గ 'పరిచయ వేదిక'

ఆదోని, ఏప్రిల్ 10: నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తల పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గురువారం ఉదయం 10 నుంచి స్థానిక జీబీ గార్డెన్‌లో పరిచయ కార్యక్రమం ఉంటుందన్నారు. సార్వత్రిక ఎన్నికలకుగాను మిత్రపక్షమైన బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథికి ఆదోనికి టికెట్ కేటాయించారన్నారు. దీంతో తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు చాలామంది సందిగ్ధంలో ఉన్నారని పేర్కొన్నారు. అందుకే నాయకులు, కార్యకర్తలకు ఈ పరిచయ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు నందమూరి అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


మాట్లాడుతున్న మీనాక్షినాయుడు

టర్పెంటైన్ ఆయిల్ తాగి బాలుడికి తీవ్ర అస్వస్థత

ఆదోని, ఏప్రిల్ 10: ఆదోని మండలం అలసందగుత్తి గ్రామానికి చెందిన సోమన్న, సంధ్య దంపతుల ఏకైక కుమారుడు ఐదేళ్ల అఖిల్ టార్పెంట్ ఆయిల్ తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బుధవారం అలసందగుత్తి గ్రామంలో దేవర ఉన్న కారణంగా ఇంటికి రంగులు వేయించడానికి సోమన్న రంగులతో పాటు టార్పెంట్ ఆయిల్ తెచ్చి, ఇంటికి రంగులు వేశాక మిగిలింది ఇంట్లో ఉంచారు. దీంతో అఖిల్ నీళ్లు అనుకుని బాటిల్‌లో ఉన్న టర్పెంట్ ఆయిల్‌ను తాగాడు. వెనువెంటనే వాంతులు చేసుకుంటుండగా గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు.

ఎన్నికల ప్రక్రియపై పీవో, ఏపీవోలకు శిక్షణ

● 17సీ, పీవో డైరీ, పీవో రిపోర్ట్‌లతో పాటు ఈవీఎమ్ కనెక్షన్ మీద స్పష్టమైన అవగాహన అవసరం

● ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

ఆదోని, ఏప్రిల్ 10: నియోజకవర్గ పరిధిలో ఉన్న పీవోలు, ఏపీవోలకు సాధారణ ఎన్నికల-2024 నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం స్థానిక రోషన్ గార్డెన్ హాల్లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ సమయంలో ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా పోలింగ్ రోజున పూరించాల్సిన 17సీ, పీవో డైరీ, పీవో రిపోర్ట్‌లతో పాటు ఈవీఎమ్ కనెక్షన్ మీద స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాల పీవో, ఏపీవోలకు గత వారంలోనే జిల్లా స్థాయిలో ఎన్నికల నిర్వహణపై శిక్షణ నిర్వహించినట్లు పేర్కొన్నారు. గతంలో ఎన్నికల సమయంలో ఈవీఎమ్‌లు సరిగ్గా కనెక్ట్ చేయనందున పనిచేయడం లేదనే అపోహ ఉండేదని, అటువంటి పరిస్థితి మరల రాకూడదనే పీవో, ఏపీవోలకు హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ ఇస్తున్నామన్నారు. మే 13వ తేదీన ఎన్నికల పోలింగ్ ఉంటుందని, దాని ముందు రోజు మెటీరియల్ డిస్ట్రిబ్యూట్ చేసిన తర్వాత మెటీరియల్ మొత్తం వచ్చిందో...? లేదో..? చెక్ చేసుకోవాలనే తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. పీవో హ్యాండ్ బుక్స్‌ను కూడా తెలుగులోకి అనువదించి నోట్స్ రూపంలో అందించినట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం పీవోలు, ఏపీవోలు ఏ విధంగా ఈవీఎం మెషిన్ కనెక్ట్ చేస్తున్నారు, మాక్‌పోల్ ఏ విధంగా నిర్వహించి క్లియర్ చేస్తున్నారని సబ్ కలెక్టర్ ప్రత్యక్షంగా ప్రతి టేబుల్ వద్దకు వెళ్లి వారు చేస్తున్న పనితీరు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనా సుల్తానా, డీఎల్‌పీవో వీరభద్రప్ప, ఉప తహసీల్దార్ రుద్రగౌడ్, వలిబాషా, మాస్టర్ ట్రైనర్‌లు ఆదిమూర్తి, సుధాకర్ పాల్గొన్నారు.

టైపింగ్‌లో ప్రతిభ చాటిన విద్యార్థి

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 10: ఎమ్మిగనూరు పట్టణంలోని శ్రీలక్ష్మీనరసింహ టైప్‌రైటింగ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు టైపింగ్‌లో తమ ప్రతిభను చాటారు. ఆదోనిలో జరిగిన ప్రభుత్వ టైపింగ్ పరీక్షల్లో ఎమ్మిగనూరుకు చెందిన దరణీధర్‌రెడ్డి 100 మార్కులకు గాను 94 మార్కులు సాధించి ప్రతిభను చాటినట్లు ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి తెలిపారు. మొత్తం 8 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 8 మంది ఉత్తీర్ణతను సాధించారన్నారు. విద్యార్థులకు టైపింగ్ సర్టిఫికెట్ ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

సీపీఐ వారు ఎవరు పార్టీ మారలేదు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 10: మండల పరిధిలోని కె. తిమ్మాపురం గ్రామంలో సీపీఐ వారు పార్టీ మారినట్లు వచ్చిన వార్తలు అవస్తవమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడు, పట్టణ కార్యదర్శి రంగన్న, బీటీ చినన్న తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ తిమ్మాపురం గ్రామం సీపీఐకి కంచుకోటగా ఉందన్నారు. గ్రామంలో ఎవరైనా పార్టీ మారి ఉంటే ఇతరులు వేరేపార్టీల వారు అయి ఉంటారని సీపీఐ వారు కాదన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో రైల్వే ఐజీ

మంత్రాలయం, ఏప్రిల్ 10: రాఘవేంద్రస్వామి దర్శనార్థం సికింద్రాబాదు రైల్వే ఐజీ అరామాసింగ్ ఠాకూర్ బుధవారం మంత్రాలయం వచ్చారు. ఈయనకు గుంతకల్లు డీఎస్పీ మురళికృష్ణ, ఏఎస్పీ రాజగోపాల్ రెడ్డి, ఐపీఎఫ్ రమేష్‌గౌడు, లక్ష్మణ్, మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రాయలం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మెమెంటో అందజేసి ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. అనంతరం తుంగభద్ర రైల్వేస్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఏఎస్ఐ అంతయ్య, వెంకటయ్య, వ్యాసరాజాచార్, బిందుమాధవ్, జయతీర్థాచార్‌లు పాల్గొన్నారు.


రైల్వే ఆర్పీఎఫ్ ఐజీకి మెమెంటో ఇస్తున్న రైల్వే అధికారులు

రాఘవరాయడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ

మంత్రాలయం, ఏప్రిల్ 10 : వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా చేశారు. బుధవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు.


బంగారు కవచంతో అలంకరించిన బృందావనం

వారానికొక్కసారే తాగునీరు

● పగిడిరాయి కొత్తూరులో దాహం


పగిడిరాయి కొత్తూరులో తాగునీటి కోసం ఎదురు చూస్తున్న మహిళలు

తుగ్గలి, ఏప్రిల్ 10: పగిడిరాయి కొత్తూరులో తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడింది. వారానికి ఒక్క రోజు మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ గ్రామంలో 400 కుటుంబాలు నివసిస్తున్నాయి. దాహార్తి తీర్చడం కోసం ఉన్న బోర్లు, భూగర్భజలాలు ఇంకిపోవడంతో కొళాయిలకు నీరు రావడం లేదు. నూతనంగా వేసిన బోరు మండ్లవానిపల్లె నుంచి వారానికి ఒక్కసారి మాత్రమే సరఫరా చేస్తున్నారని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కోసారి పదిరోజులైనా పది బిందెల నీరు కూడా రావడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. రేయింబవళ్లు పనులు వదలుకుని ఎద్దులబండ్లు, ద్విచక్రవాహనాలు, ఆటోల్లో వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని గ్రామానికి చెందిన మల్లమ్మ, మంగమ్మ వాపోయారు. "ఏడాది క్రితం ఒక బోరు వేశారు. అందులో నీరు ఉన్నా. ఎలాంటి కనెక్షన్ ఇవ్వలేదు. అధికారులు కనీసం గ్రామం వైపు కన్నెత్తి చూడడం లేదు" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఐదేళ్లకు ఒకసారి ఓటు అడగడానికి మాత్రమే పాలకులు వస్తారని, ఇలాంటి ఆపద సమయాల్లో పట్టించుకునేవారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి ఎద్దడిని నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పదేళ్లుగా ఎమ్మెల్యే ఏం చేస్తున్నట్లు..?

● ఎమ్మెల్యే సాయిపై డాక్టర్ పార్థసారథి ధ్వజం


బాలింతను పరామర్శిస్తున్న డాక్టర్ పార్థసారథి

ఆదోని టౌన్, ఏప్రిల్ 10: పట్టణంలోని మాతా, శిశు సంక్షేమ ఆస్పత్రి (ఎంసీహెచ్)లో రోగులకు కనీస సౌకర్యాలు లేవని, పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న సాయిప్రసాద్ రెడ్డి ఏమి చేస్తున్నారని ఎన్‌డీఏ కూటమి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి విమర్శించారు. బుధవారం ఆయన ఆసుపత్రిలోని బాలింతలను పరామర్శించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. దుర్గంధం వస్తోందని, వార్డులలో వేళకు సరైన భోజనం పెట్టడం లేదని, కనీసం తాగునీటి వసతి కూడా లేదని రోగులు వాపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతివారం స్కానింగ్ కోసం వస్తున్న 500 మంది బాలింతలకు రెండు స్కానింగ్ మిషిన్లు మాత్రం ఉన్నాయని, బాత్రూంలు ఏడు నిర్మించినా ఒక్కటి మాత్రమే అందుబాటులో ఉండటం పై రోగులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. అసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీకు చైర్మన్‌గా ఉన్న ఎమ్మెల్యేకు రోగుల బాగోగులను పట్టించుకొనే సమయం కూడా లేకపోవడం సిగ్గుపడాల్సిన విషయమని విమర్శించారు. ఆయన వెంట బీజేపీ ఆదోని అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజ్ గౌడ్, దేశాయ్ చంద్రన్న పాల్గొన్నారు.

హెచ్ కైరవాడిలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన

గోనెగండ్ల, ఏప్రిల్ 10: మండల పరిధిలోని హెచ్ కైరవాడి గ్రామంలో సీఎం వైస్ జగన్ బొమ్మతో ఉన్న వ్యాన్‌లో రేషన్ సరుకులను ప్రజలకు సరఫరా చేస్తున్నారు. బుధవారం గ్రామంలోని బీసీ కాలనీలో రేషన్ వాహనం వైఎస్ జగన్ బొమ్మను పెట్టుకొని నిత్యవసర వస్తువులను పంపిణీ చేసింది. రాజకీయ నాయకులు బొమ్మలను రేషన్ వాహనం పై పెట్టుకొని రేషన్ పంచడం కోడ్ ఉల్లంఘనే నని గ్రామస్థులు చెబుతున్నారు. సంబంధింత అధికారులు రేషన్ వాహనం దారునిపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


రేషన్ పంపిణీ వాహనం పై సీఎం వైఎస్ జగన్ బొమ్మ

తాగునీటి సమస్యను తీర్చండి

కౌతాళం, ఏప్రిల్ 10: కౌతాళంతో పాటు మండలంలోని చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సమస్యను తక్షణమే పరిష్కరించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం మండల కార్యదర్శి జగదీష్, అధ్యక్షుడు నాగేంద్రప్ప అన్నారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కౌతాళంలో రాజానగర్ వద్ద ఎస్ఎస్ ట్యాంకును నిర్మించినా గ్రామ ప్రజలకు మాత్రం 8 రోజులకొకసారి వదలడంతో గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. రౌడూరు, లింగాలదిన్నె గ్రామాలతో పాటు ఎంపీపీ అమరేశ స్వగ్రామం అగసలదిన్నెలో తాగునీటి కోసం తల్లడిల్లుతున్నారని పేర్కొన్నారు. రౌడూరు గ్రామ ప్రజలు బాపురం చెక్‌పోస్టు వద్దకు ఆటోలు, ఎడ్లబండ్లు, ద్విచక్రవాహనాల ద్వారా తెచ్చుకుంటున్నారు. అగసలదిన్నెలో ఓహెచ్ఆర్ ట్యాంకు ఉన్నా దానికి అధికారులు పంపింగ్ చేయకపోవడంతో దిష్టి బొమ్మలా దర్శనమిస్తోందని, అధికారులు వెంటనే స్పందించాలని కోరారు.